# మనశ్శాంతి

శ్రీ సి. సి. పున్నయ్య

రమణ, వాసు, చలం అన్నదమ్ములు. తండ్రి చిన్నప్పుడే చనిపోయాడు. ఉన్న కొద్ది గొప్ప ఆస్తితో రమణ గవర్నమెంటు పాఠశాలలో ఉపాధ్యాయుడుగాను, వాసు ఒక చిల్లరకొట్టు పెట్టి వచ్చే ఆదాయంతో కుటుంబమును పోషించేవారు. చలం యింకా అప్పటికి బళ్ళోకి పోతుండేవాడు. చలం కడగొట్టు వాడు కాబట్టి తల్లి చాలా గారాబంగా చూస్తుంటే పెద్దకొడుకు లిద్దరు వచ్చే ఆదాయం చాలక కుటుంబ పోషణ భారము అధికమయి రుసరుస లాడేవారు.

రమణకు, వాసుకు వివాహమయి భార్యలు కాపురానికి వచ్చారు. చలంకు మాత్రము పాతిక ఏళ్ళు పైబడినా వివాహం కాలేదు. అతనికి పెండ్లికని అన్నలు పూనుకోరు. పిల్లనిస్తామని వాళ్ళ గడపలోకి వచ్చి చాల కాలం వరకు అడిగినవా రెవరు లేరు. తల్లి తన కొడుక్కు పెళ్ళి కాలేదని ఎంత ఆవేదన పడితే మాత్రం ఏమి లాభం? — ఆదరి — ఆమె మాటను పెద్దకొడుకు లిద్దరు లక్ష్యపెట్టరు. దాని ఫలితంగా చలం అవివాహితుడుగా నిలబడిపోవడమే కాక వీర బాగుల వాడిలాగ ఊరు తిరుగ సాగాడు.

ఎలాగైతే నేమి చలంకు 30 సం||ల వయస్సు సమీపించబోయేటప్పుడు ప్రక్క యూళ్ళోని నారాయణరావుగారు తన పిల్లనిచ్చి స్వంత ఖర్చుతో వైభవంగా వివాహం చేశారు. దాంతోబాటు మామగారి పలుకుబడి చలంకు ఉద్యోగం సంపాదించి పెట్టకలిగింది. పెళ్ళి అయింతవరకు బాధ్యతారహితంగా తిరుగుతూ పిచ్చిపుల్లయ్యలాగుండే చలం జీవితంలో వచ్చిన విప్లవాత్మకమైన మార్పును చూచి యింట్లో బయట ఆశ్చర్యపడ సాగారు. కుటుంబంలో అన్నలతో బాటు అనూ సంపాదిస్తున్నాడు; మరి భార్య కాపరానికి వచ్చినప్పటినుండి చలం ప్రవర్తనలో ఒక పద్ధతి ఏర్పడింది. ఆఫీసుకు పోయి రావడం, యిల్లు తప్పు మనుషులలాగ తిరగడం మానుకు పోయింది. తన యింట్లో తన భాగ్యాలంటే ఏమిటో, హాస్యాలు, అవకాశాలంటే ఏమిటో అర్థం చేసి కొని తన భాగ్యము. తల్లిని సుఖపెడుతూ జీవయాత్ర సాగింపసాగాడు. వాళ్ళ కొక కుమారుడు పుట్టాడు. వాడిని చూసుకొని మురిసిపోతూ ఆ దంపతు లిద్దరు అన్యోన్యానురాగాలతో నుంటుండేవారు.

కాని రోజు లెప్పుడూ ఒక రకంగా నుండవు — ఆ యూళ్ళో మసూచికం రోగం బద్దది. దాని ఫలితంగా మొదటి జట్టులోనే చలం భార్య చనిపోయింది. మరల అతని జీవితం అయోమయమయింది. మళ్ళీ పెళ్ళి చేసికోమని తల్లి శతవిధాల పోరసాగింది. చలం వద్దంటే వద్దన్నాడు. తనకు, తన బిడ్డకు తల్లి జీవించియున్నంత కాలం ఏ లోటుండదని అనుకున్నాడు. తాను గృహస్థుడుగా సుఖపడే యోగమే యున్నట్లయితే తన భార్య బ్రతికి యుండేదని పలుమార్లు తల్లికి నచ్చచెప్పాడు. కాని తనకు, తన బిడ్డకు ఆధరువనుకొనిన తల్లి సంవత్సరము నిండకముందే స్వర్గస్థురాలైంది.

ఇక చలం నిరాధారుడైనాడు. తన జీవితంలో క్రమ్మిన కారు చీకట్లు భయానకమైనవి. ముఖ్యంగా తన బిడ్డను తానెలా పెంచి పెద్దవాణ్ణి చేయగలనా అనే బెంగతో తన కుమారుని రక్షణను తన పెద్దన్న, వదినెల కొప్పగించి సన్యసించడం మనశ్శాంతికి మార్గమని నిర్ణయించుకున్నాడు. వదినెగారిని ఆశ్రయించి "వదినా! నా బిడ్డను కాపాడాల్సిన బాధ్యత నీదేనమ్మా" అని ప్రాధేయపడ్డాడు.

"అదేమిటి చలం! అలాగంటావు. ఇంత మందిమి యుంటే నీ కుమారుడికేం కొరత యుంటుంది."

"అది కాదమ్మా!—బాబును మీ కొప్పగించి సన్యాసినై ఋషీకేశము పోవ నిర్ణయించుకున్నాను. వాడికి మీరే తల్లిదండ్రులై పెంచి పెద్దవాణ్ణి చేయండి. ఇందుకు నేను యావజ్జీవ పర్యంతము కృతజ్ఞుడను గా నుంటాను."

"అదేమిటి — సన్యాసం తీసికోవాల్సిన కష్టం ఏం పట్టింది? మళ్ళీ పెళ్ళి చేసికొని మాతో బాటుండక!"

"వద్దులే తల్లీ! యిల్లు, సంసార మన్నా విస్తు కంపర మెత్తుతున్నది. ప్రశాంత వాతావరణంలోనే కాని మనస్సుకు స్థిమితం ఏర్పడదు. అందుకు సన్యాసంకంటే మరో మార్గం లేదు. ఏదో కృష్ణా, రామా అనుకుంటూ జీవిత విశేషం గడుపుతాను" అన్నాడు బాబు వంక చూస్తూ.

తన్నువిడిచి తండ్రి వెళ్ళిపోతున్నాడని తెలిసినట్లు బాబు బావురుమని ఏడుపు ఆరంభించాడు.

ఆ మాటలు విన్న వదినెకు సంతోష మయింది. ఉమ్మడి ఆస్తిలో నుండి భాగ మైనా పంచుకోకుండా మరిది పరారైపోతే అది తమకే లాభమనుకొన్నది.

"వదినా! నేను వెళ్ళినప్పటినుండి బాబును మాత్రం నీ బిడ్డలాగ చూసుకుంటావని చేతిలో చెయ్యి వెయ్యి" అని చేతిలో చేయి వేయించు కొని బయలుదేరబోయాడు. కాళ్ళకు చుట్టుకొని కదలనీయని బాబును విదదీయ మానాడు; వాడు గుక్కపట్టి ఏడ్వసాగినది కుప్ప కూలిపోయాడు—అల్లో అనేక ఆలోచనలు గిర్రున తిరిగాయి—చూస్తూ చూస్తూ బాబును వదినె చేతుల్లో వదిలేసిపోతే ఎలాగ చూస్తుందో!—ఒకవేళ ప్రేమగా చూచినా తల్లిదండ్రులు లేని లోటుండదంటా యుంటుంటా!—తన స్వేచ్ఛాజీవితానికి కానా మా బాబు అడ్డమనుకున్నాడు; కాని వాడిని వదిలిపెట్టి పోవడం మూలంగా వాడి జీవితమే భగ్నమయితే!—అలా అయితే అందుకు బాధ్యత తనదే కదూ!—మహాపాపం! మహాపాపం!

ఆగుమూర్తైనా, మాసి ఆకైనా కొని సన్యసించడం నిశ్చయం. ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి నిద్రపోయిన బాబును తన ఒళ్ళో నుండి చాప మీద పండుకో బెట్టి చలం తన మార్గాన్ని అనుసరించాడు.

ఋషీకేశంలో చలం సన్యాసాశ్రమం స్వీకరించాడు. దాంతోటి పేరు నిత్యానంద్ గా మారిపోయింది. కాని తాను ఆశించిన మనశ్శాంతికి మాత్రం దూరమయ్యాడు. ఏదో బాధ—మానసిక శారీరక బాధలలో ఏ ఒక్కటని చెప్పకలిగేవాడు కాడు. తాను నిత్యకార్యక్రమంలో కాని, జీవితంలో కాని చిత్తశుద్ధి కలిగియుండటం లేదని ఆత్మఘోషిస్తున్నట్లనిపించేది. తనలోని అశాంతికి, బాధకు కారణమేమిటో రాత్రింపగళ్ళు ఆలోచించినా అంతు దొరకలేదు. అతని గురువు ఒకనాడు "ఆనంద్! అనుక్షణం నీ వైఖరిని గమనిస్తున్నాను—ఎందుకలా కలవర పడుతుంటావు" అని అడిగాడు.

"ఏదో బాధ స్వామీ!—అశాంతి."

"పిచ్చివాడా!—ప్రశాంతమైన యీ

వాతావరణంలో నీ కీ బాధకు, మానసిక అశాంతికి కారణము ఏమైయుంటుంది ?"

"మీరు అడుగుతున్న ప్రశ్నకు నేను ఏమి జవాబు చెప్పాలో తెలియడం లేదు". గురువు గొంచెముసేపు కళ్లు మూసుకొని ఆలోచించి

"నీకు భార్యయుందా" అని అడిగాడు.

"లేదు స్వామీ!—ఆమె చనిపోవడమే నన్ను సన్యాసాశ్రమ స్వీకరణకు ప్రోత్సహించింది."

"తల్లిదండ్రులు లేరా!"

"లేరు ప్రభూ!"

"పోనీ సంతానమున్నదా."

"ఆ....ఉన్నది—నాలుగేళ్ళ కుర్రాడు."

ఏదో అర్థమయినట్లు తలయూపి "ఒకసారి మీ యూరికి వెళ్ళివద్దామా" అన్నాడు.

"అలాగే స్వామీ!"

రమణ కుమార్తె పుట్టినరోజు పండగ ఆ రోజున. బంధుమిత్రులతో యిల్లు సందడిగా నున్నది. ఇంటిల్లిపాది క్రొత్త గుడ్డలు కట్టుకొని షడ్రసోపేతంగా భోంచేసి ఆనందపరవశులుగా నున్నారు. ఆ యింట్లో మారుమూలల మాత్రం ఒక ఆరేళ్ళ కుర్రాడు ఏకాంతంగా తారట్లాడుతున్నాడు. ఆ రోజు ప్రతిదినం లభించే యెంగిలిపోయిన మెతుకులైనా నోచుకోలేదో లేదో ఆ యింట్లో—చిక్కి మొగంతో, చింపి గుడ్డలతో, తైల సంస్కారము లేని రేగిన జుట్టుతో—పాపం ఆకలి కాబోలు! కాని అతని హృద్బాధను గుర్తించేది ఎవరు? అతని గోడు ఎవరికి కావాలి!—వాడే చలం కుమారుడు—చిట్టిబాబు.

వచ్చే పోయ్యే వాళ్ళ హడావుడి తగ్గింది. చిట్టిబాబు మెల్లగా దొడ్డిదారిగుండా బయటికి జారాడు. ప్రక్కయింటి డాక్టరు వాడిని పిలిచి "ఏం బాబూ!—మీ యింట్లో యీ రోజు పండగ కదా—యీ చింపి చొక్కా ఏమిటి?" అన్నాడు.

"నా కింతకంటె మంచిది లేదు."

"ముఖం ఏమిటి అలాగ వాడిపోయి యుంది!"

"నా కింకా అన్నము పెట్టలేదు."

"ఇంకా అన్నము పెట్టకపోవడ మేమిటి!—అంటే ప్రొద్దుటినుంచీనా!"

"అవును."

డాక్టరు భార్యను పిలచి "రాజీ! బాబుకు తినడాని కేమైనా పెట్టు" అన్నాడు.

ఆమె పళ్ళెంలో బిస్కట్లూ, మిఠాయి, అరటిపండు తెచ్చి పెట్టింది.

బాబుకు ఎంత ఆకలి అయిందో పాపం—తినవన్నీ తిని, ఆలస్యమైతే పినతల్లి కోప్పడు



కాళ్ళకు చుట్టుకొని కదలనీయని బాబును విడదీయబోయాడు చలం

తుందని "నేను వెళ్ళివస్తానని" బయలు దేరాడు.

"పళ్ళెంలో మిగిలినవాటిని జేబులో వేసుకొని తీసుకొని వెళ్ళు బాబూ!" అన్నది డాక్టరు భార్య.

"వద్దమ్మా! మా పిన్ని వీటిని చూచిందంటే చావగొట్టి చెప్పుకు న్నుంది."

"ఎందుకు కొడుతుంది?—ఎప్పుడైనా కొడ్తుంటుందా" అన్నాడు డాక్టరు.

"అనేకసార్లు—చేతిలో ఏది యుంటే దాంతోనే" అని చెప్పి గబగబ వెళ్ళేడు.

బాబు రాకను చూచి, పినతల్లి ముందే "ఎక్కడికి వెళ్ళావు—కొంపకొంప తిరుగుతూ మేము కొట్టామని, తిట్టామని చెప్పుతున్నావే కదూ!"

"నేను అలా ఏమీ చెప్పలేదమ్మా!"

"నోరు ముయ్యనా!—నాకు తెలుసు—నిజం చెప్పావా లేక ..." అన్నది గుడ్లురుముతూ.

రమణ "ఈ వెధవ కొంపకొంప దగ్గర మనమీద చాడీలు చెప్పసాగా డన్నమాట" అన్నాడు.

"లేదమ్మా !....యికముందు చెప్పను...." అన్నాడు బాబు.

"అయితే యిప్పుడు చెప్పి వస్తున్నావన్న మాట" అంటూ మూలనున్న కర్రతో బాబును చావ మోదింది.



# స్వప్నం

చిత్రకారుడు: శ్రీ ...

అంతే—వాడు అలాగే ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడి నిద్రపోయాడు. వాడిని ఆలన, పాలన చేయడానికి తల్లీయా—తండ్రీయా!

* * *

మర్నాడు ఉదయం రమణ గారి వాకిట్లో ముగ్గురు సన్యాసులు ప్రత్యక్షమయ్యారు. మొదట్లో గుర్తు పట్టకపోయినా వారిలో ఒకడు తన మరదియని త్వరగానే గుర్తించి యింట్లోకి వెళ్ళి భర్తతో చెప్పింది. రమణ వచ్చి "ఏంరా చలం! యింతలో యిలాగ మారిపోయావు—రండి కూర్చోండి" అంటూ ఆ సన్యాసులను లోనికి ఆహ్వానించాడు.

నాల్గురోజులు గడుస్తుండగా నిత్యానందుడుగా మారిన చలం రమణతో "అన్నయ్యా! పిల్లకాయల నొకసారి పిలిపించు; వారిని చూడాలని యుంది" అన్నాడు.

రమణ లోపలికి వెళ్ళాడు. భార్యాభర్తలు లోపల ఏదో మధనపడి తమ బిడ్డలతో పాటు చిట్టిబాబునుకూడ వెంటబెట్టుకొని బయటికి వచ్చారు. గంతలాంటి చొక్కా తొడిగి ఏదో సేవకుడిగా బాబును తమ బిడ్డలతో పాటు ముస్తాబు చేసినట్లు కనబడింది.

ఆనందోత్సాహాలతో కళకళలాడుతున్న అన్నబిడ్డల మధ్య బిక్క-చిక్కి పాలిపోయి, వాడిపోయిన ముఖంతో తత్తరపాటుతో దిక్కు తోచక చూస్తూ, భయపడుతూ నిలబడిన బాబును చూసేసరికి చలం కళ్ళు తిరిగినట్లయింది. తను వదిలిపోయేటప్పుడు వచ్చీరాని మాటలతో ఎంతో ఉత్సాహంగా ఆడుకుంటూ యుండిన బాబు యీనాడు నిర్జీవమైపోయినందుకు తన అన్నగారి యింట్లో వాడనుభవించిన హింస, యాతనలు అర్థమయింది. అనుమానింపగా తెల్ల పట్టుకొని బాబును ఒళ్ళోకి తీసికొని రెండు అశ్రుబిందువులు రాల్చాడు.

"బాబు ఒక్క క్షణమైనా యింట్లో యుండడు. ఎప్పుడూ ఎండలో తిరుగుతుంటాడు—చూడు వాడి మొహం ఎలాగ వాడిపోయిందో" అని వదిన బాబు దీనావస్థకు తాను కారణము కాదన్నట్లు నిరూపించ ప్రయత్నించింది.

"బాబూ! నేనే నీ తండ్రిని—నిన్ను యింత కాలము దిక్కు లేనివానిగా చేసి పారిపోయిన దుర్మార్గుడను—ఏదీ తల ఎత్తు"

అంటూ చిన్నగడ్డం పట్టుకొని ముఖం పైకెత్తాడు. చలం కండ్లనుండి బొలబొల రాలిన అశ్రుబిందువులు బాబు ముఖంమీద పడినవి. దిగాలైన ముఖము వికసించసాగిందా అనిపించింది. బాబు నేత్రాలు సయితం ఆనంద బాష్పములతో నిండినవి.

"ఇంతకాలం నీకు మనశ్శాంతి లేకపోవటానికి కారణము అర్థమయిందనుకుంటాను— పద పోదాం" అన్నాడు గురువు.

"అన్నయ్యా! నేనున్న మునుపటిగదిలో యీరోజు రాత్రి పండుకోవాలని యున్నది, రెండు చాపలు వేయించు" అని చెప్పి చలం తన కుమారునితో గురువు వెంట వెళ్ళాడు.

ఊరిబయటి శివాలయాని కి చేరారు ముగ్గురు. అప్పుడే అభిషేకము అలంకారము సమన్వితుడుగా నున్న ముక్కంటి తేజోవంతంగా కనుపించాడు. ముగ్గురూ నమస్కరించారు. దేవాలయ ప్రాంగణమున నున్న చెట్లలో లభించిన కన్నెరుపూలతో ఈశ్వరార్చన చేశారు. ముగ్గురూ బయలుదేరి భిక్షాటన చేసి లభించిన ఆహారంతో సంతుష్టులైనారు— బాబుకు నాడు పండుగలాగుంది. కడుపునిండా ఆహారం— అవ్యాజమైన పితృప్రేమ అతనిలో నవజీవితోత్సాహానికి దోహదమయినవి ఆ నాటి రాత్రి వాళ్ళు ముగ్గురు మునుపటి చలం గదికి పండుకోడానికి వెళ్ళారు. మూలనున్న చాపలను పరచుకొని సన్యాసు లిద్దరు బాబును మధ్య పరుండబెట్టుకొని తాము విశ్రమించారు.

తానుసన్యసించినప్పటినుండి నిద్రంటే ఎరుగని చలంను పండుకోంగానే నిద్రాదేవి పూనింది. నిద్రలో ఒక స్త్రీ—దివ్యమూర్తి "ఏలాగైతేనేం స్వస్థానానికి వచ్చి చేరావు సంతోషం. ఈ గదిలో నీవు, నీ భార్య అనుభవించిన ఆనందమయ జీవితం జ్ఞాపకముందికదూ!— దాని ఫలితమేకదూ యీ 'బాబు'. భార్య చనిపోగానే విరక్తుడవై బాధ్యతను విస్మరించి నీవు సన్యసించిన ఫలితం నీవే చూడకలిగావు— సంతోషం — తల్లిపోయిన తర్వాత బిడ్డకు తండ్రే ఆధారం కావాలి. అతనిని పెంచి పెద్దవాడినిచేసి పోషించవలసిన బాధ్యత తండ్రిది. ఆ బాధ్యతను విస్మరించిన తండ్రి ఏ ఆశ్రయము స్వీకరించినా తాను వాంఛించిన మనశ్శాంతి కాని, దైవచింతను కాని పొందలేడు పిచ్చివాడా! సన్యాసాశ్రమ స్వీకరణకు పారమార్థిక చింత ప్రాతిపదిక కావాలి. అది నీ కపాటిదియుండి సన్యాసి వయ్యావో చెప్పు" అన్నది. చలం కలవరపాటుతో లేచి ప్రక్కన నిద్రపోతున్న గురువును లేపాడు.

"స్వామీ! ఎవరో దివ్యమూర్తి!—జగజ్జనని—శక్తిస్వరూపిణి నాకు కర్తవ్య బోధన చేసింది. నా బిడ్డ శ్రేయస్సే నాకు వాంఛిస్తున్న మనశ్శాంతిని, దైవచింతను, పారమార్థిక చింతను యివ్వగలదట" అన్నాడు చేతులు జోడించి.

"మహామ్మాటికి నిజమంతే మానవుడు ఏ ఆశ్రమము స్వీకరించినా విధ్యంసానికి కాక నిర్మాణాని కుపకరించాలి; అదే పరమార్థం. బాధ్యతను విస్మరిస్తే ఫలితా లెప్పుడూ విధ్వంసకరంగానే తయారవుతవి. మానవ సేవను, భగవత్సేవను సమన్వయపరచి నీవు, నీ బాబు సుఖంగా నుండండి. నీవు సన్యసించుట వలన ఎవరికీ అపకారము, హాని కలుగనప్పుడు నీవు సన్యాసివై మాతోపాటు లోక కళ్యాణానికి కృషి చేయవు గాని. నాపని పూర్తయింది వెళ్ళివస్తా" నని గురువు ఆ చీకట్లోనే తన దారిన తాను వెళ్ళిపోయాడు. ★



బ్రిటన్‌లోని క్రొత్తరకం టెలివిజన్ బండి